సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 23 । నవంబర్ । 2024



జోరుగా ఇసుక అక్రమ రవాణా

పెండ్లిమర్రి మండలం బుడ్డాయపల్లె గ్రామ సమీపంలోని పాపాఘ్నినదిలో కూటమి నేతల ఆధ్వర్యంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. -8లో



వైవీయూ వెబ్‌సైట్ సేవలకు అంతరాయం

అధికారుల నిర్లక్ష్యంతో యోగివేమన యూనివర్సిటీ వెబ్‌సైట్ సేవలు నిలిచిపోయాయి. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.6/18.9

జిల్లాలో శుక్రవారం 18.9 - 30.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'ఏపీ ఎన్‌జీజీఓ' సభ్యత్వ నమోదు



జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సభ్యత్వ నమోదు చేపట్టిన ఏపీ ఎన్‌జీజీఓ సభ్యులు

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం ఏపీ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌నేతలు నగర శాఖ పర్యవేక్షణలో ఉద్యోగులకు సభ్యత్వాన్ని కల్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నగర అధ్యక్షులు కె.చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు తిమ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బాల పుల్లయ్య, నగర కోశాధికారి నాగార్జునరావు, ఉపాధ్యక్షులు బాదుల్లా, రాజు, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి



పులివెందుల మెగా లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ రాజారత్నం

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణ పరిధిలోని మెగా లేఅవుట్‌లో నిర్మిస్తున్న గృహాలను వేగంగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రాజారత్నం పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలోని మెగా లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ డిఈ రమణారెడ్డి, డీఈసీ ఏజెన్సీ ప్రతినిధి శ్రీనివాస్‌లను ఫీల్డ్, ఆన్‌లైన్లలో ఇంటి నిర్మాణ దశలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాముడు, హౌసింగ్ సిబ్బంది, వార్డు అమినిటీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పెండింగ్ బిల్లులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఈ హౌసింగ్ రామసురా రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

రాయలసీమలోని సంస్థలను అమరావతికి తరలించరాదు



మాట్లాడుతున్న రవిశంకర్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాయలసీమలో ఉన్న సంస్థలను అమరావతికి తరలించరాదని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మట్లాడుతూ అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి, లోకయుక్త, మానవ హక్కుల కమిషన్, ఇక్కడే ఉంచిన విధంగా ఏపీజీబీ, ఇతర సంస్థలను రాజధాని అమరావతికి తరలించటం లేదని చెప్పాలన్నారు. కార్యక్రమంలో, ఆర్‌సీపీ నగర కార్యదర్శి, మగ్బుల్ బాషా, మడగలం ప్రసాద్, పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి మీనాక్షి

చాపాడు: పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి విద్యను బోధించాలని జిల్లా విద్యాధికారి మీనాక్షి అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాధికారి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు, విద్యా బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ.. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రణాళికా బద్ధంగా చదువు చెప్పాలన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరాలంటే పాఠశాల విద్య ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వంశీకృష్ణ, కస్తూర్బా స్పెషలాఫీసర్ నాగలక్ష్మీ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేతల మాటలకు అర్థాలే వేరులే!

ఆడవారి మాటలకు అర్థాలే వేరులే...అంటూ ఓ సినిగేయ రచయిత పాట రచించారు. వాస్తవానికి ఆ స్థానంలోకి రాజకీయ నాయకులు వచ్చి చేరిపోయారు.వారి మాటలకు చేష్టలకు పొంతన లేకుండా ఉంది. 'నోటితో మాట్లాడడం, నొసలుతో వెక్కిరించడం, దేని పని దానిదే'అన్నట్లుగా ఉండిపోయింది. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు అదే విషయాన్ని రూఢీ చేస్తున్నాయి. బీజేపీకి చెందిన పార్లమెంట్ సభ్యుడు రమేష్‌నాయుడు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిల వ్యవహారంలో డొంకతిరుగుడు మాటలు తెరపైకి వచ్చాయి. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకతీతంగా ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తుండటం గమనార్హం.

- రిత్విక్ సంస్థపై దాడి చేసినా నోరు మెదపని ఎంపీ రమేష్‌నాయుడు
- రెచ్చిపోయి ఊగిపోతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి
- ఆపై వైఎస్సార్‌సీపీ నేతల పనులంటూ.. డొంకతిరుగుడు మాటలు
- ఎమ్మెల్యే మాధవీరెడ్డి సైతం మద్యం షాపుపై అసెంబ్లీలో ప్రస్తావన
- అన్నింటా పాత్రధారులు... సూత్రధారులు కూటమి నేతలే



రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సైట్ ఇంజినీర్లపై దాడి చేస్తున్న ఎమ్మెల్యే ఆది వర్గీయులు (ఫైల్)




సాక్షి ప్రతినిధి, కడప: జిల్లాలో ఆదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎంపీ రమేష్‌నాయుడుకు చెందిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ చేపడుతోంది. కొండాపురం మండలంలోని దొబ్బుడుపల్లె, రావికుంట, తిరువాలయపల్లె గ్రామాలతోపాటు మైలవరం మండలంలోని బొగ్గులపల్లె గ్రామాల పరిధిలో ఆ పనులు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనులన్నీ తమ వర్గీయులే చేపట్టాలంటూ జమ్మలమడుడు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పట్టుబట్టారు. మంతనాలు, హెచ్చరికలు, రాయబేరాలు ఎలా నడిపినా, ఆశించిన తీరులో నిర్మాణ పనులు దక్కలేదు. దీంతో ఎమ్మెల్యే ఆది కుటుంబ సభ్యులు శివనారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డిల నేతృత్వంలో దొబ్బుడుపల్లె వద్ద చేపడుతున్న నిర్మాణపనుల్లో విధ్వంసం సృష్టించారు. స్థానికంగా ఉన్న రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సిబ్బందిపై దాడి చేసి, అక్కడే ఉన్న వాహనాలను పగులగొట్టారు.

బిల్టప్ మద్యం షాపుపై గళమెత్తిన రెడ్డెమ్మ...



ఎమ్మెల్యే మాధవీరెడ్డి కడపలో మద్యం షాపుల నిర్వహణ తీరుపై అసెంబ్లీలో గళమెత్తారు. మార్పు పేరిట డీ-అడిక్షన్ సెంటర్ మేడపైన నిర్వహిస్తుంటే, ఆ బిల్డింగ్ కిందనే మద్యం షాపు ఏర్పాటు చేశారని చెప్పుకొచ్చారు. కింద తాగి చెడిపోయిన వారు పైనున్న సెంటర్‌లో ట్రీట్‌మెంట్ తీసుకుంటారన్నారు. వాస్తవంగా ఎమ్మెల్యే లేవనెత్తిన ప్రశ్న మంచిదే అయినా, ఈ వ్యవహారంలో పాత్రధారులు, సూత్రధారులను బహిరంగ పర్చి ఉంటే బాగుడేందని పలువురు చెప్పుకొస్తున్నారు. జిల్లా కేంద్రమైన కడపలో రెడ్డి వైన్స్ వర్సెస్ మౌర్య వైన్స్ మధ్య పెద్ద ఎత్తున ఆధిపత్య పోరాటం నడిచిన విషయం జగమెరిగిన సత్యం. అక్కడ మౌర్య వైన్స్ ఉంచరాదనే విషయంపై అధికారులపై రాజకీయ ఒత్తిడులు వచ్చినా అక్కడే కొనసాగిస్తున్నారంటే మరో అధికార పార్టీ నేత ప్రమేయం ఉండడమేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. జమ్ములమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వ్యవహారంలోనైనా, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి అసెంబ్లీలో గళమెత్తినా ఈ మొత్తం వ్యవహారంలో పాత్రధారులు,సూత్రధారులు కూటమి ప్ర భుత్వ నేతలేనన్నది సుస్పష్టం. ఆ విషయాన్ని బ హిర్గత పర్చకుండా జాగ్రత్తపడుతూ రాజకీయ నే తల చర్యలు ఉన్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.



తెరవెనుక మంత్రాంగంలో సీఎం రమేష్‌నాయుడు

క్షేత్రస్థాయిలో రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పనులు అడ్డుకొని స్థానికంగా ఉన్న సైట్ ఇంజినీర్లపై ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు దాడి చేస్తే ఎంపీ రమేష్‌నాయుడు, ఆయన కుటుంబ సభ్యులు బాహాటంగా నోరు మెదపలేదు. తెరవెనుక మంత్రాంగంలో రమేష్‌నాయుడు ఉండిపోయారని సమాచారం. ఆమేరకు తన సోదరుడు రాజేష్‌నాయుడు సీఎం చంద్రబాబు వద్దకు పంపించి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. మరో వైపు రిత్విక్ సంస్థపై దాడి చేయలేదని, ఆదానీ కంపెనీపై దాడి చేశారంటూ కలరింగ్ ఇస్తూ ప్రచారం చేసుకుంటున్నట్లు సమాచారం. సీఎం స్థాయిలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు దాడి చేపట్టిన వ్యవహారంపై వాకబు చేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పనులు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చెప్పుకొచ్చారు. ఆదే వాస్తవమైతే ఫలానా వైఎస్సార్‌సీపీ నాయకులు పనులు చేస్తున్నారని, వారు అక్కడే ఉండి రెచ్చగొట్టారని ఎందుకు బహిరంగంగా ప్రకటించలేదని విశ్లేషకులు నిలదీస్తున్నారు. రూ.1800కోట్ల సివిల్ పనులు రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ ఎలా ఇస్తారన్నదే ఎమ్మెల్యే వర్గీయుల అసలు ప్రశ్న. ఆ పనులు తామే చేయాలన్నదే వారి ఆకాంక్ష. ఆ విషయాన్ని తెరమరుగు చేసి, వైఎస్సార్‌సీపీ నేతల పనులంటూ దాడి వ్యవహారాన్ని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి రక్తి కట్టించారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కిడ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో ట్యాలీ ప్రైమ్, జీఎస్టీ అడ్వాన్స్, ఎక్సెల్ కోర్సుల్లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం, ఎంకాం ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు 20-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఇందుకు అర్హులన్నారు. విజయవాడలో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు.ఇతర వివరాలకు 90004 87423 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

24న భట్రాజుల వన భోజనం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా భట్రాజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24న కార్తీక వన భోజనం కార్యక్రమం నిర్వహించనునట్లు సంఘం ప్రధాన కార్యదర్శి అవధానం రఘురామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శివకేశవులకు భేద భావం లేకుండా ప్రత్యేక పూజలు నిర్వహించే అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసంలో వన భోజనం కార్యక్రమం ద్వారా అందరూ ఒక చోట చేరి పవిత్రమైన ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని చలమారెడ్డిపల్లె శివాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పార

నేడు మదనపల్లెలో ఉర్దూ కవి సమ్మేళనం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం బెంగళూరు బస్టాండులోని బడేమకాన్ దర్గా ఆవరణలో శనివారం రాత్రి అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ముషాయిరా కమిటీ కన్వీనర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్, కార్యదర్శి ఖమర్ అమీని తెలిపారు. శుక్రవారం దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కవి సమ్మేళనానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా హాజరుకానున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ఉర్దూ కవులు కార్యక్రమంలో పాల్గొని మహా ప్రవక్త హజరత్ మహమ్మద్ జీవితంపై నాత్ ఏ షరీఫ్ పఠిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ఉర్దూ భాషాభిమానులు, సాహితీప్రియులు హాజరుకావాలని కోరారు.

'ఉద్యాన రైతులను ప్రోత్సహించాలి'





తెల్లపాడు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ (ఇన్‌సెట్) ప్రభుత్వ పాఠశాలలో నిద్రిస్తున్న కలెక్టర్

కలసపాడు: ఉద్యాన పంటలు వేసుకున్న రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తెల్లపాడు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా దూలంవారిపల్లెలో కొమ్ములహరి ఉపాధి హామీ కింద సాగు చేసిన చీనీ పంట, మొక్కజొన్న పంటను పరిశీలించారు. చీనీ పంటలో ఎంత దిగుబడి వస్తోందని, పంటను ఎక్కడికి ఎగుమతి చేస్తారని, గిట్టుబాటు ధర ఉందా అని అడిగి రైతులను తెలుసుకున్నారు. అనంతరం దూలంవారిపల్లె చెరువును, తెలుగుగంగ ఎడమ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ స్వయం సహాయక సంఘాల గ్రూపులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు తమ కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు పెడుతున్నారా లేదా అని ప్రధానోపాధ్యాయురాలు రమాదేవిని అడిగి తెలుసుకున్నారు.జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ విజయ కుమార్, ఆర్డీఓ చంద్రమోహన్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూముల కేటాయింపుల్లో నిబంధనలు పాటించాలి

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ భూమిని కారణం లేకుండా అడుగు కూడా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే హక్కు రెవెన్యూ అధికారులకు లేదని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. కదిలే ప్రతి అధికారిక కాగితం ఎస్ఓపీ ప్రకారమే జరగాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్డీఓలు, మండల తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ భూముల కేటాయింపులో రెవెన్యూ అధికారులు ప్రాథమిక అంశాలను విస్మరించరాదన్నారు. ఎక్కడైనా అలసత్వం, దుర్వినియోగం తన దృష్టికి వస్తే సహించేది లేదన్నారు. వీఆర్వో నుంచి డీఆర్వో వరకు ఫైల్ రికార్డుల నిర్వహణ కచ్చితంగా జరగాలన్నారు. అధికారులు మారినా రికార్డుల నిర్వహణ మాత్రం మారకూడదన్నారు. ఎక్కడైనా రికార్డులు లేవనే సమాధానం వస్తే ఆ అధికారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల స్థాయిలో ప్రతి గ్రామ భౌగోళిక, సామాజిక అంశాలపై తహసీల్దార్లకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు.డిసెంబరు 1వ తేది నుంచి ప్రతి కార్యాలయంలో ఈ-ఆఫీసు నిర్వహణ సక్రమంగా జరగాలని సూచించారు. అన్ని సచివాలయాల పరిధిలోప్రభుత్వ సేవల కోసం వచ్చే వినతులను నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాలన్నారు. వారానికి కనీసం మూడు గ్రామసభలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ ఆహార ఉత్పత్తులకు ఊతం

జిల్లాలో స్థానికంగా పేరొందిన సంప్రదాయ ఆహార ఉత్పత్తులను ఊతమిచ్చే విధంగా బ్రాండింగ్, మార్కెటింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో ఏపీ స్టేట్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, డీఆర్‌డీఏ, మెప్మా, హార్టికల్చర్,ఏపీఎంఐపీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్థానికంగా లభ్యమయ్యే సంప్రదాయ ఆహార ఉత్పత్తులను మార్కెటింగ్, బ్రాండింగ్ తీసుకురావడంతో రైతులకు సైతం ఆదాయం చేకూరుతుందని అన్నారు. జిల్లాలో ప్రాధాన్యం ఉన్న స్వీట్స్, కారాలు మిల్లెట్, ఊరగాయలు, పౌడర్లు, స్పైసెస్ వంటి ఆహార ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ తీసుకురావాలని కోర్ టీం అధికారులను ఆదేశించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల సహకారంతో వీటిని చేపట్టాలని సూచించారు. కడప అరిశ, పోరుమామిళ్ల ఊరగాయలు, చాపాడు, ఖాజీపేట, మైదుకూరు పసుపు, రాజుపాలెం, జమ్మలమడుగు(దేవగుడి) పాలకోవా, ప్రొద్దుటూరు తంగెడుపల్లి స్వీట్ ,పులివెందుల, వేముల మిల్లెట్స్ వంటి ఆహార పదారాల ప్రమాణాలు, నాణ్యతలను అధికారులు పరిశీలించి ఎలా తయారు చేస్తున్నారు? ఎలా ప్రాసెసింగ్ చేస్తున్నారు? ప్యాకింగ్ ఏ విధంగా చేస్తున్నారు వంటి అంశాలను అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వంటకాలకు, ప్రాచుర్యం ఉన్న మాధవరం చీరలు వంటి వాటికి దశలవారీగా భౌగోళిక గుర్తింపు తీసుకురావాలన్నారు. ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ ఎంఈ)కింద ఆహార ఉత్పత్తులకు ప్రోత్సాహకం అందుతుందని తెలిపారు. సమావేశంలో ఏపీ ప్రాసెసింగ్ సొసైటీ మార్కెటింగ్ మేనేజర్ మారుతి, హార్టికల్చర్ డీడీ సుభాషిణి,ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద నాయక్, మెప్మా పీడీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ సంతకం ఫోర్జరీ

- నకిలీ సర్వే సర్టిఫికెట్ల తయారీ

ప్రొద్దుటూరు: సర్వే సర్టిఫికెట్‌లో ఏకంగా మున్సిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో పాటు నకిలీ చలానాలు, సర్టిఫికెట్లు తయారు చేసి మున్సిపాలిటీ ఆదాయానికి ఉద్యోగులే గండికొడుతున్న ఘటన శుక్రవారం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇళ్లు, స్థలాలు తదితర ఆస్తుల రిజిస్ట్రేషన్ లావాదేవీలకు గతంలో డోర్ నంబరు వేసేవారు. ఇప్పుడు సర్వే నంబరు సర్టిఫికెట్ అడుగుతున్నారు. ఈ కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని రిటైర్డు అధ్యాపకుడు బద్వేలి బాలమునిరెడ్డి సర్వే సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశారు. సాధారణంగా పట్టణ పౌరులు ఎవరైనా నేరుగా పౌరసేవా కేంద్రానికి వెళ్లి సర్వే కోసం దరఖాస్తు చేయవచ్చు. అయితే టౌన్ సర్వేయర్ కృష్ణ కిశోర్ మాత్రం తన అనుమతి లేనిదే ఎవ్వరు దరఖాస్తు చేయడానికి వచ్చినా అనుమతించ వద్దని సదరు ఉద్యోగులకు సూచించారు. ఈ కారణంగా సర్వే కోసం వస్తున్న ప్రజలు నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి రూ.1000 చలానా మొత్తాన్ని టౌన్ సర్వేయర్ చేతికి ఇస్తున్నారు. అయితే సర్వే సర్టిఫికెట్ కోసం సర్వేయర్ రూ.5వేలు డిమాండ్ చేయడంతో బాల మునిరెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డికి ఫిర్యాదు చేశారు.



బాలమునిరెడ్డికి ఇచ్చిన లోగో లేని ఫేక్ చలానా

వైస్ చైర్మన్ ఆరా: ఈ విషయంపై మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి గురువారం మున్సిపల్ కార్యాలయ పరిధిలోని పౌర సేవా కేంద్రానికి వెళ్లి ఆరా తీశారు. అసలు బాల మునిరెడ్డి సర్వే కోసం దరఖాస్తు చేసినట్లు చలానా లేని విషయాన్ని ఆయన గుర్తించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వద్దకు పాతకోట బంగారు మునిరెడ్డితోపాటు మరో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా వెళ్లారు. రూ.5వేలు మామూలు అడగడమేమిటని వారు కమిషనర్‌ను ప్రశ్నించారు. బాలమునిరెడ్డి సర్వే కోసం కట్టిన చలానా చూపించాలని కమిషనర్ కోరారు. టౌన్ సర్వేయర్ ఇచ్చిన ఫైల్‌లోని చలానాతో పాటు తయారు చేసిన సర్వే సర్టిఫికెట్‌ను కమిషనర్ పరిశీలించారు. వైస్ చైర్మన్‌ల ఫిర్యాదు మేరకు ఆయన సదరు ఉద్యోగులను పిలిపించారు. ఒరిజనల్ చలానాలపై లోగో ఉంటుందని, ఇది ఫేక్ చలానా అని వారు తెలిపారు. సర్వే సర్టిఫికెట్‌లో ఉన్న సంతకం తనది కాదన్న విషయాన్ని మున్సిపల్ కమిషనర్ అప్పటికే గుర్తించారు. వాస్తవానికి సర్వే కోసం ప్రతి రోజు మున్సిపల్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకునేవారు ఉంటారు. అయితే ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు కేవలం 32 మంది మాత్రమే చలానా చెల్లించినట్లు ఆన్‌లైన్‌లో నమోదైనట్లు తెలిసింది. ఈ ప్రకారం ఉద్యోగులు పెద్ద మొత్తంలో ఫేక్ చలానాలను తయారు చేసి సొమ్ము చేసుకోవడంతోపాటు మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ ఎ.మల్లికార్జున, టౌన్ సర్వేయర్ కృష్ణ కిశోర్‌కు మెమో జారీ చేశారు.

నాకు సంబంధం లేదు

ఫేక్ చలానాతో తనకు సంబంధం లేదని మున్సిపాలిటీలోని టౌన్ సర్వేయర్ కృష్ణ కిశోర్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు లిఖిత పూర్వకంగా శుక్రవారం సాయంత్రం సమాధానం ఇచ్చారు.

డబ్బు ఎవరు చెల్లిస్తారు?

సర్వే రాళ్లపై అక్షరాల తొలగింపు ఖర్చుపై సర్వేయర్లు

కడప సెవెన్‌రోడ్స్: రీ సర్వే రాళ్లపై ఉన్న వైఎస్ఆర్, జగనన్న భూ రక్ష-2020 అనే అక్షరాలు చెరిపేసేందుకు అయ్యే ఖర్చును అధికారులు తమపై మోపుతున్నారంటూ జిల్లాలోని పలువురు సర్వేయర్లు వాపోతున్నారు. సర్వే రాళ్లపై అక్షరాలు చెరిపివేసే ఒక్కో స్టోన్ బ్రషింగ్ యంత్రం రూ. 8 వేలుపైగానే అవుతోందని, ఆ డబ్బు తమకు ఎవరు చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇందుకోసం తాము అడ్డదారులు తొక్కలేమంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇంతటి పెద్ద కార్యక్రమానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు జరిపి ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయం అధికారులను అడగ్గా పని పూర్తి చేసిన తర్వాత చెల్లిస్తామనడం పలు సందేహాలకు తావిస్తోందంటున్నారు.

వంద సంవత్సరాల క్రితం ఎప్పుడో బ్రిటీషు వారు భూముల రీ సర్వే అండ్ రీ సెటిల్‌మెంట్ నిర్వహించారు. ప్రతి 30 ఏళ్లకోమారు రీ సర్వే జరగాల్సి ఉంటుంది. అలా జరగకపోవడం వల్ల అనేక భూ వివాదాలు తలెత్తాయి. న్యాయస్థానాల్లో ఇందుకు సంబంధించిన సివిల్ వివాదాలు ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. వీటన్నింటినీ పరిష్కరించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రీ సర్వే అనే బృహత్తర కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో మొదటి దశలో 86 గ్రామాల్లో 98,478.83 ఎకరాల్లో రీ సర్వే నిర్వహించారు. రెండోవిడతలో 99 గ్రామాల్లో 132442.40 ఎకరాలు, మూడోదశలో 97 గ్రామాల్లో 225356.17 ఎకరాల్లో రీ సర్వే జరిపారు. ఇలా మొత్తం 282 గ్రామాల్లో 4,56,277 ఎకరాలను రీ సర్వే నిర్వహించి రాళ్లు పాతారు. భూ సరిహద్దు రాళ్లపై చెక్కిన వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష-2020 పేర్లపై నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు అండ్ కో పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే అక్షరాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఇందుకు అవసరమైన బడ్జెట్ విడుదల చేయకపోవడం క్షేత్ర స్థాయి సర్వే సిబ్బందిలో అనుమానాలకు కారణమైంది.



లింగాల మండలం నరసింగరావుపల్లెలో సర్వే రాళ్లపై ఉన్న అక్షరాలను తొలగిస్తున్న సర్వే సిబ్బంది

ఇవన్నీ అపోహలు మాత్రమే

జిల్లాలో ఇప్పటికి 25 వేల రాళ్లపై అక్షరాలు తొలగించాం. డిసెంబరు 31 నాటికి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాం. ఒక్కో రాయిపై ఉన్న అక్షరాలను తొలగించేందుకు ప్రభుత్వం రూ. 15 చొప్పున ఇస్తుంది. సీసీఎల్ఏ ఇందుకు సంబంధించిన సర్క్యులర్ ఉత్తర్వులను కూడా జారీ చేశారు. డబ్బులు ఇవ్వరనేది అపోహ మాత్రమే.

– మురళీకృష్ణ, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి, కడప

కడప ఏఆర్ డీఎస్పీగా కె. శ్రీనివాసరావు

– ఏఆర్ డీఎస్పీ మురళీధర్ జెన్‌కోకు బదిలీ

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఏఆర్ విభాగంలో వివిధ కేటగిరిలలో పనిచేస్తున్న 29 మంది ఏఆర్ డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వార కాతిరుమల రావు ఉత్తర్వులను జారీ చేశారు. ఈక్రమంలో కడప ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తున్న బి. మురళీధర్‌ను జెన్‌కోకు బదిలీ చేశారు. జెన్‌కోలో పనిచేస్తున్న కొల్లూరు శ్రీనివాసరావును కడప ఏఆర్ డీఎస్పీగా నియమితులయ్యారు.

32 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ముద్దనూరు : స్థానిక జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో దాచివుంచిన 32 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. ఫారెస్టు రేంజి అధికారి అశోక్‌కుమార్ యాదవ్ సమాచారం మేరకు.. తిరుపతి అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు జమ్మలమడుగు రహదారిలో కొండదిగువన ఉన్న జగనన్న కాలనీలో ముందస్తు సమాచారం మేరకు తనిఖీ చేశారు. తనిఖీలో ఓ ఇంట్లో 32 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. దుంగలు లభించిన ఇంటి వివరాలు సేకరిస్తున్నారు. వీటి విలువ సుమారు రూ.4లక్షల వరకు ఉంటుందని అంచనా. తిరుపతిలో పట్టుబడిన దుంగల దొంగలను విచారిస్తుండగా ముద్దనూరులో దాచిన దుంగల విషయం బయటపడినట్లు సమాచారం.

వైవీయూ వెబ్‌సైట్ సేవలకు అంతరాయం

సేవలను నిలిపివేసిన నిర్వాహక సంస్థ



22కేడీపీ402: నిలిచిపోయిన వైవీయూ వెబ్‌సైట్

వైవీయూ : ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆన్‌లైన్ సేవల ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. అయితే విశ్వవిద్యాలయ అధికారుల నిర్లక్ష్యంతో విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ సేవలు నిలిచిపోయాయి. యోగివేమన విశ్వవిద్యాలయానికి డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.వైవీయూ.ఈడీయూ.ఇన్ అనే వెబ్‌సైట్‌ను అధికారికంగా నిర్వహిస్తూ వస్తోంది. సాంకేతిక సేవలు, ఇతరత్రా సేవలు అందించేందుకు నెల్లూరుకు చెందిన కేవీఆర్‌ఎస్‌ఎస్ సంస్థ గత కొద్ది సంవత్సరాలుగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తోంది. అయితే సదరు సంస్థ సేవలు గతనెల 19వ తేదీనే ముగిశాయి.

అయితే సదరు సంస్థ నిర్వాహకులు వైవీయూ ఐటీ విభాగానికి సమాచారం అందించినప్పటికీ పట్టించుకోలేదన్న విధంగా వెబ్‌సైట్ సర్వీసెస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. వైవీయూ అధికారుల నుంచి ఎలాంటి కమ్యూనికేషన్ లేకపోవడంతో ఈనెల 16వ తేదీన విశ్వవిద్యాలయానికి అందించే సాంకేతిక సేవల నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. తాజాగా శుక్రవారం పలువురు విద్యార్థులు, ఇతర ప్రాంతాల పరిశోధకులు వైవీయూ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేస్తే 'సర్వీసెస్ సస్పెండ్' అని వస్తుండటంతో వైవీయూ అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

త్వరగా అందుబాటులోకి తీసుకువస్తాం..

వైవీయూ వెబ్‌సైట్ నిలిచిపోయిన విషయం మా దృష్టికి వచ్చిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. సదరు సంస్థ వర్క్ ఆర్డర్ గడువు ముగియడంతో సేవలకు అంతరాయం కలిగింది. వైవీయూ వెబ్‌సైట్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకువస్తాం.

– ఆచార్య టి. శివప్రతాప్, ఐటీసెల్ డైరెక్టర్, వైవీయూ

ట్రాక్టర్లను పట్టుకున్నారు.. వదిలేశారు

గోపవరం : మండలంలోని పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సోమశిల నుంచి బద్వేలుకు వస్తున్న దాదాపు 20 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. కాగా చెక్‌పోస్టు వద్ద నిలిపివేసిన ట్రాక్టర్లకు ఇసుకను తరలించేందుకు ఎలాంటి అనుమతులు లేవు. దీంతో పోలీసులు చెక్‌పోస్టు వద్ద ట్రాక్టర్లను నిలిపివేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహావసరాలకు మాత్రమే ఇసుకను తీసుకెళ్ళాలని, దీని కోసం తహసీల్దారు అనుమతి తప్పనిసరి అని పోలీసులు ట్రాక్టర్ల యజమానులకు సూచించారు. సోమశిల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా నిత్యం వందల సంఖ్యలో బద్వేలు, పోరుమామిళ్ల, మైదుకూరు ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అనుమతులు లేకుండా వాహనదారులు ఇసుకను తరలిస్తే సీజ్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు. కాగా పట్టుబడిన 20 ట్రాక్టర్ల యజమానుల వివరాలు సేకరించి పోలీసులు వదిలేశారు. ట్రాక్టర్లను పట్టుకోవడం, ఆ తర్వాత వదిలేయడం పట్ల పోలీసులపై విమర్శలు వస్తున్నాయి.

దౌర్జన్యకారులపై చర్యలు తీసుకోండి



బద్వేల్ ఎన్‌జీఓ కాలనీలో ప్రైవేట్ స్థలం ఆక్రమించి పనులు చేయిస్తున్న దృశ్యం

బద్వేల్ వ్యవసాయం : తాము డబ్బులు పెట్టి కొనుగోలు చేసిన ఇంటి స్థలాన్ని, అందులో నిర్మించుకున్న రేకుల షెడును ఇద్దరు విలేకర్లు రెండు రోజుల కిందట దౌర్జన్యంగా ఆక్రమించుకుని విద్యుత్ మీటరును కూడా ఏర్పాటు చేసుకున్నారు. వారి నుంచి మా స్థలం విడిపించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బద్వేల్ పట్టణం గాంధీ నగర్ చెందని మహిళ జి.సుబ్బరత్నమ్మ శుక్రవారం జిల్లా కేంద్రమైన కడపలో కలెక్టర్, ఎస్పీని కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోపవరం మండల పరిధిలోని మడకలవారిపల్లె గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 952లో ప్లాట్ నెంబర్ 146 హెచ్‌ఎస్ నెంబర్ 267/91 లో 0.08 సెంట్లు ఇంటి స్థలం నాభర్త గల్లా రామిరెడ్డి పేరున 2022లో రాజంపేట నివాసి షేక్ జాఫర్ మియ్యా కుమారుడు షేక్ ఖలీల్‌బాషా నుంచి కొనగోలు చేశామని తెలిపారు. కొనుగోలు చేసిన సమయంలోనే అందులో రేకుల షెడ్డు కూడా వేశామన్నారు. అయితే రెండు రోజుల క్రితం బద్వేల్‌కు చెందిన ఇద్దరు పత్రికా విలేకర్లు ఎన్‌జిఓ కాలనీలోని మా స్థలాన్ని ఆక్రమించి అందులో విద్యుత్ మీటరు కూడా బిగించి ప్రహరి కూల్చివేశారని బాధితురాలు వాపోయింది. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే ఇది సివిల్ పంచాయతీ తహసీల్దారు వద్దకు వెళ్లమన్నారని తెలిపింది. అక్కడ తహసిల్దార్ లేకపోవడంతో కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సుబ్బరత్నమ్మ చెప్పింది.

రక్తదానం చేయడం సామాజిక బాధ్యత



సర్టిఫికెట్లు పొందిన ఎన్‌సీసీ కేడెట్స్‌తో కల్నల్, ప్రిన్సిపాల్

వైవీయూ : రక్తదానం చేయడం సామాజిక బాధ్యత అని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ఎన్‌సీసీ దినోత్సవ వేడుకల్లో భాగంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ దినోత్సవ వేడుకల్లో భాగంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ మనం చేసే రక్తదానం రక్తం, ప్లాస్మా, ప్లేట్లెట్ వంటి వివిధ రూపాల్లో ఆపదలో ఉన్న వ్యక్తుల ప్రాణాలను నిలబెడుతుందన్నారు. ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్. నీలయ్య, డా. మహేష్ మాట్లాడుతూ ఎన్‌సీసీ వేడుకల్లో భాగంగా కేడెట్స్ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎన్‌సీసీ 'సి', 'బి' సర్టిఫికెట్‌లో ఉత్తీర్ణత సాధించిన ఎన్‌సీసీ కేడెట్స్‌కు సర్టిఫికెట్లు అతిథులు చేతుల మీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంకు అధికారి డాక్టర్ రాజేంద్ర, సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, అధ్యాపకులు డా. సురేష్‌బాబు, డా. ఎ. నాగరాజు, రెడ్డిబాషా, పరీక్షల నియంత్రణాధికారి డా. రామకృష్ణ, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో జైలు



శిక్ష పడిన వీరభాస్కర్

బద్వేలు అర్బన్ : ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఓ వ్యక్తికి తిరుపతి ఎర్రచందనం కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి 5 సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.6 లక్షలు జరిమానా విధించినట్లు బద్వేలు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ నయీమ్‌అలీ తెలిపారు. శుక్రవారం సిద్దవటం రోడ్డులోని ఫారెస్టు బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2018 డిసెంబర్ 17వ తేదీన లంకమల అభయారణ్యంలోని గోపాలపురం పాత నర్సరీ సమీపంలో దుంగలను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించగా సిద్దవటం మండలం వెంకటాయపల్లె గ్రామానికి చెందిన యాతగిరివీరభాస్కర్‌ను అదుపులోకి తీసుకుని ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అప్పటి నుంచి తిరుపతి ఎర్రచందనం కేసుల ప్రత్యేక కోర్టులో విచారణ జరిగి విచారణలో వీరభాస్కర్‌పై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల కఠిన కారాగారశిక్షతో పాటు రూ.6 లక్షలు జరిమానా విధించారని, జరిమానా కట్టని నేపథ్యంలో మరో 6 నెలలు శిక్ష అదనంగా అనుభవించాల్సి వస్తుందని తీర్పు వెల్లడించినట్లు ఎఫ్‌ఆర్‌ఓ తెలిపారు.

తెలుగుగంగ కాలువలో పడి వ్యక్తి మృతి

కాశినాయన (కలసపాడు) : మండలంలోని కొండ్రాజుపల్లె గ్రామానికి చెందిన బసిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి (39) తెలుగుగంగ కాలువలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈశ్వర్‌రెడ్డి గత సంవత్సరం కాలం నుంచి మానసిక పరిస్థితి బాగా లేక పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తుండేవాడు. అతని బాగోగులను అన్న బసిరెడ్డిబాలిరెడ్డి చూసుకుంటుండేవాడు. గురువారం గ్రామానికి పడమర వైపు ఉన్న తెలుగుగంగ కాలువకు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన బి.ఈశ్వర్‌రెడ్డి పొలం నుండి గ్రామానికి వస్తూ బసిరెడ్డిఈశ్వర్‌రెడ్డిని ఎక్కడికి వెళుతున్నావని అడిగాడు. ఎక్కడికి వెళ్లలేదని, కొద్దిసేపటి తర్వాత ఇంటికి వస్తానని చెప్పాడన్నారు. అతను కొద్ది దూరం వచ్చి వెనక్కి తిరిగి చూడగా మతిస్థిమితం లేని ఈశ్వర్‌రెడ్డి కనిపించకపోవడంతో అతడి అన్న బాలిరెడ్డికి సమాచారం ఇచ్చారు. బాలిరెడ్డి గ్రామస్తులతో తెలుగుగంగ కాలువ చుట్టూ వెతికినా కనబడలేదు. శుక్రవారం సాయంత్రం తెలుగుగంగ కాలువలో బసిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. విషయం కాశినాయన పోలీసులకు తెలిపారు. తన తమ్ముడు ప్రమాదవశాత్తు కాలుజారి ఉండవచ్చునని, అతడి మరణంపై కుటుంబ సభ్యులకు ఎటువంటి అనుమానం లేదని పోలీసులకు బాలిరెడ్డి తెలిపారు.

రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓకు దేహశుద్ధి

– ప్రేమ పేరుతో సాటి వీఆర్‌ఓను మోసం చేసిన వైనం

రామకుప్పం : ప్రేమ పేరుతో సాటి వీఆర్‌ఓను నమ్మించి పెళ్ళి చేసుకోకుండా కాలయాపన చేస్తున్న వీఆర్‌ఓపై ప్రియురాలి బంధువులు దేహశుద్ధి చేసిన ఘటన శుక్రవారం చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలి బంధువులు తెలిపిన వివరాలిలా.. వైఎస్సార్ జిల్లాకు చెందిన శ్రవణ్ రామకుప్పం మండలంలోని కొంగనపల్లి వీఆర్‌ఓగా పనిచేస్తున్నాడు. రామకుప్పం మండలంలోని ఓ పంచాయతీ వీఆర్‌ఓగా పనిచేస్తున్న యువతి గత మూడు సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. శ్రవణ్ యువతిని పెళ్ళి చేసుకుంటానని చెప్పి ప్రేమాయణం సాగించాడు. ఈ క్రమంలో తనను వివాహం చేసుకోవాలని యువతి శ్రవణ్‌ను కోరగా కాలయాపన చేస్తూ వచ్చాడు. అతని ప్రవర్తనలో మార్పును గమనించిన ఆమె జరిగిన విషయాన్ని బంధువుల దృష్టికి తీసుకెళ్ళింది. దీంతో బంధువులతోపాటు యువతి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న శ్రవణ్‌ను నిలదీసింది. అతని నుంచి పెళ్లి విషయమై సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహించిన యువతి బంధువులు అతనికి దేహశుద్ధి చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్‌తో చర్చించి వీఆర్‌ఓకు న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు యువతి బంధువులకు చెప్పారు.

లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

నెల్లూరు(లీగల్) : లారీలో ప్రయాణిస్తున్న బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన పప్పర్తి సుబ్బరాయుడు అనే వ్యక్తికి 20 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ. 22 వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సి.సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2020 మే నెలలో 14 ఏళ్ల బాలిక, ఆమె చిన్నాన్న ఆత్మకూరు సమీపంలోని నెల్లూరుపాళెం వద్ద లారీ ఎక్కారు. డ్రైవర్ సుబ్బరాయుడు సంగం వద్ద లారీని ఆపి హోటల్లో టిఫిన్ ఉందేమో కనుక్కోవాలని బాలిక చిన్నాన్నను పంపాడు. అతను వెళ్లగా సుబ్బరాయుడు వేగంగా లారీని కృష్ణపట్నం పోర్టు వైపునకు తీసుకెళ్లాడు. జాతీయ రహదారి పక్కన ఆపి బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఆమె చిన్నాన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు నిందితుడికి శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మామను చంపిన అల్లుడికి జీవిత ఖైదు

మదనపల్లె : తండ్రి మరణానికి కారకుడనే నెపంతో మామను హత్యచేసిన అల్లుడికి ఏడేళ్ల విచారణ అనంతరం మదనపల్లె రెండో అడిషనల్ జిల్లాకోర్టు జీవిత ఖైదు శిక్షను ఖరారుచేస్తూ జడ్జి అబ్రహాం తీర్పునిచ్చారు. చిత్తూరు జిల్లా సోమల మండలం నెల్లిమంద గొల్లపల్లెకు చెందిన వెంకటసిద్దులు (63)ను 2017 ఆగస్టు 7వ తేదీన కలికిరి మండలం గుట్టపాళ్యం గొల్లపల్లె పొలాల వద్ద దారుణ హత్యకు గురయ్యాడు. తండ్రి హత్యపై వెంకటసిద్దులు కుమారుడు నాగరాజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అప్పి సోమల ఎస్ఐ లక్ష్మీనారాయణ అప్పట్లో కేసు నమోదు చేశారు. విచారణ బాధ్యతను అప్పటి చౌడేపల్లె సీఐ రవీంద్రకు అప్పగించారు. పోలీసు విచారణలో వెంకటసిద్దులు అల్లుడు పి.సుధాకర (45)ను నిందితుడిగా గుర్తించారు. పోలీసు విచారణలో అల్లుడు మామను హత్యచేసినట్లుగా నిర్ధారణ కావడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఏడు సంవత్సరాల పాటు కేసు విచారణ మదనపల్లె రెండో అదనపు జిల్లా కోర్టులో జరిగింది. శుక్రవారం జిల్లా కోర్టు జడ్జి అబ్రహాం నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సీఐ రవీంద్ర, ఎస్ఐ లక్ష్మీనారాయణ, సీఐ రాంభూపాల్, సోమల ఎస్ఐ శివశంకర్, కోర్టు కానిస్టేబుల్ సునీల్‌కుమార్, కోర్ట్ మానిటరింగ్ సెల్ సిబ్బందిని చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు అభినందించారు.

200 లీటర్ల నాటు సారా బెల్లం ఊట ధ్వంసం

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో కాలువ గట్టున నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల నాటు సారా బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బ్రాహ్మణపల్లె గ్రామ పరిసర ప్రాంతాల పరిధిలో నాటు సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నాటు సారాను సరఫరా చేస్తున్న మల్లికార్జునరావును అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

నల్లపురెడ్డిపల్లెలో విషాదఛాయలు



మృతి చెందిన విద్యార్థి హేమాద్రి (ఫైల్)

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ విద్యార్థి మృతితో శుక్రవారం విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన గంగరాజు, సంపూర్ణల కుమారుడు హేమాద్రి తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి అటవీ ప్రాంతంలోని వాగులో ఈతకు వెళ్లారు. నీటి లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతానికి వెళ్లడంతో హేమాద్రి మునిగిపోయాడని తన స్నేహితులు 100 కాల్ చేసి పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హేమాద్రిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే హేమాద్రి మృతి చెందినట్లు తెలిపారు. కానీ బంధువులు మాత్రం స్నేహితులు చంపేశారని ఆరోపిస్తున్నారు. హేమాద్రి మృతదేహాన్ని శుక్రవారం తిరుపతి నుంచి నల్లపురెడ్డిపల్లె గ్రామానికి తీసుకొచ్చారు. హేమాద్రి మృతదేహాన్ని చూసి గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు బోరున విలపించారు.

విద్యార్థి సంఘం నాయకుడి అరెస్టు

ముద్దనూరు : స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారి మనోహర్‌ను బెదిరించిన కేసులో రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ నాయకుడు జగన్‌ను అరెస్టు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ తెలిపిన సమాచారం మేరకు.. హాస్టల్ విద్యార్థులను మోసం చేస్తున్నావంటూ సంక్షేమాధికారిని బెదిరించి అతని వద్ద నుంచి జగన్ డబ్బులు వసూలు చేసినట్లు వార్డెన్ ఫిర్యాదు చేశారని తెలిపారు. వార్డెన్ ఫిర్యాదు మేరకు విద్యార్థి నాయకుడు జగన్‌పై కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేశారు. అతడిని కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

గ్యాంగ్ రేప్ కేసులో నిందితుడు అరెస్ట్

– పోలీసుల అదుపులో మైనర్లు

కడప అర్బన్ : వైఎస్‌ఆర్ జిల్లా కడప నగర శివార్లలోని చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పరిధిలో సుగాలిబిడికి ప్రాంతంలో మైనర్‌బాలిక గ్యాంగ్ రేప్‌కు గురైన ఘటనలో ఉదయ్‌కిరణ్ అనే యువకుడిని సీఐ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఈ సంఘటనలో మరో ఇద్దరు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి వారి ఆదేశాలను అనుసరించనున్నారు.

వీఆర్‌ఏను దూషించిన భూ ఆక్రమణ దారుడు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని ఇబ్రహీంపేటకు చెందిన సుధాకర్ అనే భూ ఆక్రమణ దారుడు తనను కులం పేరుతో దూషించాడని పెన్నపేరూరు వీఆర్‌ఏ శాంత శుక్రవారం ఒంటిమిట్ట తహసీల్దార్ రమణమ్మకు ఫిర్యాదు చేసింది. వీఆర్‌ఏ ఫిర్యాదును స్థానిక పోలీస్ స్టేషన్‌కు రెఫర్ చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

పోలీసు బందోబస్తు నడుమ ఆక్రమణల తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పోరుమామిళ్ళ రోడ్డులో కూరగాయల మార్కెట్ నుంచి జెడ్పీ హైస్కూల్ చివరి వరకు గత కొన్నేళ్లుగా ఉన్న అక్రమ నిర్మాణాలను పోలీసు బందోబస్తు నడుమ మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. ఇక్కడ దాదాపు 30 చిన్నపాటి దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటుండేవారు. అయితే ఇటీవల కాలంలో సంబంధిత ప్రాంతాలలో సాయంత్రం వేళల్లో వ్యాపారులు ఇష్టానుసారంగా రోడ్లపైనే విక్రయాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మూడు రోజుల క్రితం పోలీసు, మున్సిపల్ అధికారులు వ్యాపారులతో మాట్లాడి రాత్రి 9 గంటల తర్వాత ప్రజలకు ఇబ్బంది లేకుండా కూరగాయల అమ్మకాలు సాగించాలని సూచించారు. ఇదే సమయంలో ప్రహరీ ముందు ఉన్న దుకాణాల ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని మున్సిపల్ అధికారులు దుకాణాలను తొలగించారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐలు సత్యనారాయణ, రవికుమార్, మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారి సతీష్, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా



బుద్దాయపల్లె సమీపంలో అక్రమంగా ఇసుక తరలించడానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

పెండ్లిమర్రి : మండలంలోని బుద్దాయపల్లె గ్రామ సమీపంలోని పాపాఘ్నినదిలో కూటమి నేతల ఆధ్వర్యంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఇసుక తోడేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆందోళ చెందుతున్నారు. కూటమి నేతలు గ్రామాలల్లో సీసీ రోడ్లు నిర్మాణ పనులకు ఇసుక అవసరమని ప్రభుత్వ అనుమతి లేని ఇసుక రిచ్‌ల నుంచి అక్రమంగా ఇతర ప్రాంతాలకు రవాణా చేసి సొమ్ము చేసుకుటున్నారు. మరి కొందరు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను డంప్ చేసి అధిక రేట్లుకు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ల బెడద ఎక్కువ కావడంతో బుద్దాయపల్లె, మాచునూరు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం ఇసుక అక్రమ రవాణాను అడ్డుకొని రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చెరుకొని అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అలాగె బుద్దాయపల్లె గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ ఉన్న ఇసుక డంప్‌లను గ్రామస్థులు గుర్తించి రెవెన్యూ అధికారులకు చూపించారు. ఇసుక డంప్‌ను వీఆర్వో చంద్రమోళిరెడ్డి పరిశీలించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు

- అండర్-17 విభాగంలో 13 జిల్లాల నుంచి పాల్గొననున్న బాలికలు
- సిటీఎంలో క్రీడా మైదానాలు ఏర్పాటు



నెట్‌బాల్ ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారులు

మదనపల్లె సిటీ : రాష్ట్ర స్థాయి అండర్-17 నెట్‌బాల్ బాలికల టోర్నమెంటు పోటీలు శనివారం నుంచి మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. ఏపీ పాఠశాల విద్య సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 25వతేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో 13 జిల్లాల నుంచి బాలికల జట్లు పాల్గొంటాయి. క్రీడాకారులతో పాటు కోచ్‌లు, మేనేజర్లు, పీడీలు వచ్చారు. వీరికి స్థానిక ఓ కళ్యాణ మండపంలో వసతులు ఏర్పాటు చేశారు.

క్రీడా పోటీలకు పటిష్ట ఏర్పాట్లు



మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల నెట్‌బాల్ పోటీలు నిర్వహించడానికి పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. క్రీడాకారులకు ప్రత్యేకంగా వసతి,భోజన ఏర్పాట్లు చేశాం. మూడు రోజల పాటు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. – వసంత, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి

తహసీల్దార్, వీఆర్‌ఓపై కేసు నమోదు

తంబళ్లపల్లె : భూమి ఆన్‌లైన్, వన్‌బీ, పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేశారని గతంలో పని చేసిన తహసీల్దార్, వీఆర్‌ఓపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ లోకేష్‌రెడ్డి కథనం మేరకు ...గోపిదిన్నె పంచాయతీ జిల్లావారిపల్లెకు చెందిన కె.మల్‌రెడ్డి టీఎస్ శ్యామలమ్మ వద్ద 606 సర్వే నంబర్‌లో 75 సెంట్ల భూమిని కొనుగోలు చేశారు. మల్‌రెడ్డి 2014లో మృతి చెందాడు. ఆ భూమిని గతంలో పని చేసిన తహసీల్దార్ సి.కె.శ్రీనివాసులు అప్పటి గోపిదిన్నె వీఆర్‌ఓ విశ్వంభర్‌నాయుడు ఆ భూమిలోని సబ్‌డివిజన్ చేసి 606/జె 1 సర్వే నంబర్‌తో అదే గ్రామంలోని బంధువైన వి.శివారెడ్డి పేరుతో ఆన్‌లైన్ చేసి వన్‌బీ, పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేశారని మల్‌రెడ్డి కుమారుడు రెడ్డిశేఖర్‌రెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ వేశారు. కోర్టు దీనిపై విచారించాలని పోలీసులకు ఉత్తర్వులు ఇచ్చింది. మల్‌రెడ్డి కుటుంబీకుల అనుమతి లేకుండా తహసీల్దార్, వీఆర్‌ఓ ఏకపక్ష నిర్ణయాలతో వన్‌బీ, పాసుబుక్ మంజూరు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ ఫిర్యాదు మేరకు ఈనెల 5న ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.